# కల కరిగిపోయింది! ★


రచయిత:
బాలకోటీశ్వరరావు


ముక్తేశ్వరం – టు – అమలాపురం బస్సు వింటినుండి వెలువడిన బాణంలా నల్లని తారురోడ్డుమీద పరిగెడుతూంది. ఇరువంకలా నిక్కుని నవ్వుతూన్న వరిపొలాలు కొబ్బరి తోటలు నిండుమనసులతో స్వాగతం చెప్పి వెనక్కితప్పుకొంటున్నాయి. అఘ్రాణయోగ్యం కాని పరిమళాలు నాసికాపుటాలగుండా లోనికి ప్రవేశించాలనే ఆదుర్దా వ్యక్తంచేస్తుంటే, తీవ్ర గమనాలతో తమతమ కులాయాలకు చేరుకో బోయే పక్షులు శ్రవణపేయమైన కిలకిలా రావాలుచేస్తూ ఆనందాన్ని పంచిపెడుతున్నాయి. బొడ్డూడని అలకాపరులు ఈల పాటలుపాడుకుంటూ అశ్లీలవాక్యశిలీముఖాలు ఒండొరులపై విసురుకుంటూ, వివిధ వేషధారులను మోసుకుంటూ ఆయాసంతో పరుగులు తీస్తున్న మా బస్‌వంక వింతగామూస్తూ, మాలో వ్యాపించిన ఆంగ్లేయతను చూపులతోనే విమర్శిస్తూ, నోరులేని పశుసంపదను తోలుకుపోతున్నారు. పాటకపుడతులు పదాలు పాడుతూ నిబ్బరంగా నడుస్తుంటే కాయకష్టం చేయడంతో రెండింతలైన శరీర సౌందర్యాన్ని ప్రదర్శించడంలో నిమగ్నమైనాయి సంధ్యావాయు తరంగాలు. మనోజ్ఞమై నేత్రానందకరమైన ఆ ప్రకృతి రామణీయకతను సర్వమానవ హృదయంగమంగా వర్ణించలేనందుకు విచారిస్తున్న నేను నా మిత్రునిమాటలకు తృళ్లిపడి చిఱునవ్వునవ్వాను. నేను అతనిమాటలు సరిగా వినలేదేమోనని అనుకున్నాడుకాబోలు!

'కాశీ! రెండు మూడు నిముషాలలో మన గోల్ చేరుకుంటున్నాము.'

'నేనూ దానినిగురించే ఆలోచిస్తున్నాను.'

స్వగ్రామానికి సమీపంలోవున్న హైస్కూలులో ఎస్. ఎస్ ఎల్. సి. ప్యాసై కళాశాలలో కొంతకాలం గడిపి పిదప కాకినాడ పాలీ టెక్నిక్‌లో కాలుమోపాను. నాటినుండి జీవితం యాంత్రికంగా సాగ నారంభించింది. ఒకటోతేదీవచ్చేటప్పటికి చేతికి డెబ్భై రూపాయలు నాన్నగారినుండి అందుతాయి. ఖర్చులకు మఱికొంచెం కావలిస్తే కబురంపితే కాకిద్వారా పంపిస్తారు.

'అరికాలులో ముల్లుగుచ్చుకుంటే ఎమ్.బి. బి. ఎస్. లు, ఎఫ్. ఆర్. సి. ఎస్. లు వైద్యం చేయాలి. పచ్చకాగితాలకు తక్కువ బిల్లు చెల్లించితే ఆత్మ ఘోషిస్తుంది. అభిమానం విచ్ఛిన్నమౌతుంది. షార్క్‌స్కిన్‌లు ఫారిన్ సిల్కులు తప్ప మరోరకం బట్టలు ధరిస్తే మర్యాద భంగపడి మరెన్నడూ వరించనంటుందాయె. అర్థంచేసికోలేని ఆలితోనైనా సరే ఇంగ్లీషే మాట్లాడాలి. నియమోల్లంఘనంజరిగితే విసుక్కిస్తు ఆగ్రహిస్తాడు. హిందూ దేవాలయాలను కన్నెత్తి చూడకూడదు. రామున్నీ, కృష్ణున్నీ పన్నెత్తి పలుకరించరాదు. కర్మకాలి అటువంటి మూఢనమ్మకాల వాగురలో చిక్కెమో బ్రతుకంతా చిక్కిపోవడమే శిక్ష. భారతీయ సిద్ధాంతాలు బహిరంగంగా ఉద్ఘాటించడంప్రారంభిస్తేశాంతిద్రోహులమౌతాము. గాంధీతాత దండిస్తాడు. కులాంతర మతాంతర వివాహాలు అంగీకరించాలి ఆచరణ సాధ్యంకావంటే అందఱూ వెలివేసి మొలలోతు నీటిలో ముంచి ప్రాయశ్చిత్తంచేస్తారు' ఇట్లా నిత్యం నిర్భయంగా ఉపన్యసించే వెర్రి వెంగళాయి శంకరం ఇంకా ఆ ఊరిలోనే ఉన్నాడేమో? పాపం! రెంటికీ చెడిన రేవడి మాదిరిగా తయారయ్యాడు. అంతా దైవలీల తమ్ముడూ అంటాడు. అలా అనుకోవటమే మంచిదేమో! ఆ ఊరిలో నివసించే విద్యార్థులను చేరదీసి నవల్సూ నాటకాలు చదివించే శరభయ్యగారు ఇప్పుడెక్కడ ఉండివుంటారో? పిల్లాడుకూడా పుట్టాడట. నా దృష్టిలో ఆయనొక్కడే సరైనమనిషి. ఎప్పటికేయది ప్రస్తుతమో అప్పటికామాటలాడుఘనుడు, శంకరంతో స్నేహం చేస్తూ పాడౌతున్నాడేమో? దుస్సహవాసం ధూర్తత్వాన్నివ్వకపోతే మంచి పనులు చెయ్యమంటుందా? అని అడిగితే శరభయ్యగారు అదోలా నవ్వి ఇలా అంటూండేవారు. 'కాశీ! వ్యక్తుల మంచిచెడులను నిర్ణయించగలిగినవాడుఅక్కడున్నాడు. శంకరం కేరక్టర్ నా కవసరంలేదు. నా ప్రాణమిత్రుడు అలాగనైనా నే నతన్ని గౌరవించాలి. లేదా ప్రేమించాలి. మరొకవిధంగా ఆతడు నాకు పూజనీయుడు. గిఫ్ట్ ఉన్న కవి-రచయిత.'

అబ్బబ్బ....ఈ పొయిట్రీ అంటేనే నాకు తలనొప్పి. హాయిగా గేయాలు సినిమాలపాటలలాంటివి వ్రాయరాదూ? కంఠస్థంచేసి పాడుకోవచ్చు. ఆరేవడిరాసిన కవిత్వం అయోమయం....పోనీ నవలలు చదవాలని అనుకొన్నా అవి అంతకంటే ఉక్కుసెనగలు. ఆ భావాలు రాతియుగంనాటివి. భాష కొఱకరాని కొయ్య. కోయంబత్తూరుకొత్తిమిరి, గుంటూరు గోంగూరలా వుంటుంది. సిక్షేపంగా భజనకీర్తనలు రాసినా నాలుగుడబ్బులు రాలతాయి. పెళ్ళాన్ని 'ఎంజాయి' చెయ్యాలంటే ఈ 'మనీ'యే కదా గంజాయి....

భలే ఆలోచనలో కూరుకుపొయ్యావోయ్? మిత్రునినవ్వు సముద్రఘోషలా చెవులలో చొఱబడి నన్ను మేల్కొలిపింది. పరిసరాలు పరిశీలించాను. అమలాపురం లైబ్రరీదగ్గఱ బండిలో కూర్చునివున్నాను. ఆశ్చర్యంతో నన్ను నేనే గిల్లుకుని కలకాదని నిర్ణయించుకున్నాను. సిగ్గుపడుతూ 'థేంక్స్....లెటర్స్ వ్రాస్తుండు....విష్ యు గ్రాండ్ సక్సెస్!' అని స్నేహితుని అభినందిస్తుంటే బండి కదిలింది.

'అబ్బాయిగారూ' అని పిలిచాడు గుఱ్ఱపు బండితోలే మా ఊరి అసామి చిట్టిగాడు.

స్కాండ్రల్ ఎందుకు పిలిచాడా అనుకుంటూ వాడివైపు తిరిగి మిగిలినమాటల కోసం నిరీక్షించసాగాను.

నోట్లో నానుతూన్న పొగాకుచుట్ట బైటికి తీసి అడిగాడు. 'పరీచ్చలయినా యేటండి?' అయిపోయాయని సగర్వంగా తలూపాను.

'ఏ మొద్దండి?' అని వాడు సాగతీశాడు. చూపుడువేలు ఆకాశంవంకచూపించి చిన్నగా నవ్వాను.

చిట్టిగాడు కూడా నా నవ్వులో తన నవ్వు కలిపి 'చల్ చలోరే బేటా' అంటూ ఉత్సాహంగా గుర్రాన్ని కొట్టాడు.

*　　*　　*

ఒక్క సంవత్సరంలో ఈ అమలాపురం ఎంత మారిపోయింది? సిటీకళఅంతా పుంజుకొంటూంది. క్రొత్తగా వెలసిన ఫ్యాన్సీషాపులు కిరాణాకొట్లూ టీస్టాల్స్–ఓహోహో! ఒక్కటేమిటి? జనసమ్మర్దంకూడా పెరిగిపోయింది. ప్రజలలోకూడా నవచైతన్యం నయాగరా జలపాతంలా వడివడిగా ప్రవహిస్తూంది. వాడిపోని మల్లెపూవుల్లా కనిపిస్తున్నారు యువతీ యువకులు. ఇది హైస్కూలులాగానే వుంది. ఏది మారినా ఇదిమాత్రం మారలేదు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం! 'స్వామీ తెలిసో తెలియకో తప్పులుచేసే నరాధములలో నేనొకణ్ణి. నన్ను మనస్ఫూర్తిగా క్షమించు. మరి రెండు కొబ్బరికాయలు వీలుచూసుకుని సమర్పిస్తాను.' ఆహా! ఈ కళ్ళు ఏం పుణ్యంచేసు

కొన్నాయో? అప్పుడే రెండవ దేవాలయం చూశాయి. నా జన్మసీమకే వెలుగునిచ్చేవిద్యాలయం కోనసీమకళాశాల ఎన్నో జన్మలక్రితం దీనిని చూసినట్టు అనిపిస్తుంది. చదువుకున్నది సంవత్సరన్నర కాలమైనా ఇచ్చటి విద్యార్థిసోదరుల సౌహార్దం అధ్యాపకుల వాత్సల్యానురాగాలు విస్మరించడం సుసాధ్యంకాదు. 'ప్రిన్సిపాల్'గారి వేతృత్వం నేతృత్వం అనుకంప ఆదరణాసక్తి బోధనాశక్తి మస్తిష్కంలో స్థిరనివాసా లేర్పరచుకున్నాయి. మధ్యవార్తాపత్రికలలో మా కళాశాల నామధేయం సడనుగా చూచి ఎన్ని ఆనందబాష్పాలు రాల్చడం జరిగిందో ? మిగిలిన సంగతి చదివేటప్పటికి ఒళ్లంతా గగుర్పొడిచింది. కంగారు భయం కలసి మెలసి కాట్లకుక్కల్లా వేధించుకుతిన్నాయి. తింటే తిన్నాయి....తాను చదువుకున్న కాలేజికుర్రాళ్ళు 'స్ట్రైకు' చేశారంటే ఎవడిని ఆ రకం గుణాలు ఆవహించకుండా ఉండగలవ్? ఫలితాలు తెలిసేవరకూ కటిక ఉపవాసాలు చేయించి మరీ విడిచిపెట్టాయి.

"ఓ కళాశాలా! నిన్ను తిలకించి పులకించే భాగ్యం అయత్నంగా సంభవించింది. ధన్యవాదాలు....బ్రతికుంటే నెక్స్టుటైమ్ నీ దర్శనం చేసుకుని పునీతుడనౌతాను...."

ఏవిఁటీ! ఈ రోడ్డంతా ఇలా కంటకభూయిష్ఠమై సంచారయోగ్యం కాకుండా పోయింది? భేష్ భేష్ ఇది పురపాలకసంఘపతుల ఔదార్యానికి తార్కాణమేమో! అనవసరంగా రాళ్లు సమ్మెంటుతారు వగైరాలతో భూదేవిని బాధించటం దేనికని కరుణాభరణులై విందులారగిస్తున్నారన్నమాట ? ఇలాగే ఈ మార్గం ద్వారానే సునాయాసంగా ఇంటికెళ్లిపోతాం. అమ్మ నన్ను చూసీ చూడడంతోడనే చేటంత ముఖంతో ఎదురుగావచ్చేస్తుంది. నాన్న బొద్దుమీసాలలోనుండి సన్నసన్నని నవ్వులు కురిపిస్తాడు. చెల్లాయిలు తమ్ముళ్ళూ వెర్రివాళ్లలా నన్ను వాటేసుకుని ఏమిటేమిటో ప్రశ్నిస్తారు. ఎలాగెలాగో విసిగిస్తారు. వాళ్ల ఆనందంలో నేనూ పార్ట్నర్ నౌతాను. ఇంతకీ నే నిచ్చిన టెలిగ్రామ్ అందివుండదేమో? ఒకతీరున ఆలోచిస్తే అందకపోవడమే మంచిదని తోస్తుంది. నాబండి గుమ్మంముందు ఆగగానే అమ్మా నాన్నా నిర్ఘాంతపోయిప్రఫుల్లనేత్రాలతో పోగొట్టుకొన్నవాడిని తిరిగి పొందినంత సంతోషంతో 'బేర్' మంటారు. తొట్రుపాటుతో అహ్వానిస్తారు. నిర్వ్యాజప్రేమతో అమ్మ నన్ను తనచేతులతో నా పొట్ట తడిమిచూస్తుంది. హొటలుమెతుకులతో సంతృప్తిపడలేక బిర్ర బిగిసిన కడుపునుచూసి కళ్లనీళ్ళుకారుస్తుంది.

అయ్యయ్యో! అప్పుడేలాగ ఆమెనోదార్చడం ఆఁ అప్పుడప్పుడు అమ్మ అంటూండేది. 'మా అబ్బిగాడినవ్వు వెన్నెలలు మా కళ్లముందు వ్యాపించిన గాఢాంధకారాన్ని దూరంచేస్తాయి' కాబట్టి నేనో సుందరమందహాసాన్ని చిలికానంటే ఆమె తృప్తిచెంది హఠాత్తుగా నాబుగ్గలు రెండూ పారవశ్యంతో గట్టిగా చుంబిస్తుంది. అమ్మ కావించే ఈ అనుపమసన్మానం నా జీవితానికి సాటిలేని ఉత్సాహం యిస్తుంది.

అప్పుడు నెమ్మదిగా ఆమెకుమాత్రమే వినిపించేలాగున 'అమ్మా! నీ చల్లనిచూపులు నీ తీయనిమాటలు నీ వాత్సల్యపూరిత గౌరవాదరాలు నన్ను కోటిస్వర్గాలలో విహరింపజేస్తాయమ్మా. బ్రతికిన నాలుగురోజులు నీ పాదపూజచేసుకుంటానమ్మా. నీవు తప్ప నాకీ లోకంలో మరెవ్వరూ లేరమ్మా....' అని అంటాను. ఈ పలుకులకు అమ్మ ఉత్తేజితురాలై నన్ను తనివితీరా ముద్దెట్టుకుంటుంది. నా మూర్ధాన్ని అఘ్రాణిస్తుంది. రాత్రి భోజనాలవేళ నాప్రక్కన కూచుని కబుర్లు చెప్తూ అన్నం తినిపిస్తుంది. నేను నిద్రపోయేదాకా కథలుచెప్పి అనాటి ఆనందాన్ని మళ్లీయిస్తుంది. ఏమో? ఇదంతా నా ఆలోచనా ప్రాగల్భ్యమేనేమో? నిజంగా ఇలా జరగదేమో? ఎందుకు కాదు? నాకు అమ్మ అంటే ఎక్కువ గౌరవం వుంది. ఆమెకు కూడా నాపైన ఎడతెగని ప్రేమవుంది.

ఆ రోజున నేను రిక్షా ఎక్కి బయలుదేరబోతూంటే అమ్మ నా దగ్గఱకువచ్చి అన్న మాటలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. 'నాయనా! కొత్తదేశం కొత్తమనుషులు కొత్త జీవితం. నీ మీదే నా ప్రాణాలు. నన్ను అన్యాయంచెయ్యకు....' ఆ మాటలు వింటూన్నంతసేపూ నేను ఈ ప్రపంచాని కతీతుడనయ్యాను. భక్త్యావేశంపొంగిపొరలింది. గబగబా రిక్షాదిగి అనాలోచితంగా ఆమె పాదాలపై వాలాను. బొంగురుగొంతుకతో 'ఆశీర్వదించవమ్మా' అన్నాను. నాన్న మాకు నేరుగా వచ్చి మమ్మల్ని వేరుచేసి రెండు మూడు సాంత్వనవాక్యాలతో ఓదార్చి నన్ను బలవంతముగా రిక్షా ఎక్కించారు. మా మాతృపుత్ర సంబంధం గ్రామీణులకందరకూ ఆశ్చర్యాన్ని సంధించింది. అమ్మనుచూసి రమారమి పది నెలలైంది—ఇప్పుడు........

అకస్మాత్తుగా జట్కా ఆగడంతో సంభవించిన కుదుపుకి కళ్ళుతెరిచాను. పరిసరాలు నా దృష్టిపథాన్ని ఆకర్షించాయి. అలాగే బండిలో అచేతనంగా కూర్చుండిపోయాను !

వచ్చేశాం దిగండి అబ్బాయిగారూ! హెచ్చరించింది చిట్టిగాడి కంఠం. నన్నుచూసీచూడడంతోనే చెల్లాయి రమణి ఆడుకుంటూన్న ఆటలకు పంగనామంపెట్టేసి యింట్లోకి దౌడు తీసింది.

బుల్లితమ్ముడు రంగబాబు కంగారుపడ్తూ పడుతూ లేస్తూ నన్ను చేరుకుని 'అన్నయ్యా' అంటూ తళతళమెరిసే నా కాలి బాటాబూట్లు అందుకున్నాడు. అంతకంటే వాడు ఎక్కువ పొడుగు లేడుగా !

'అరి నీ అసాధ్యంకూలా' అని మనస్సులో అనుకొని వెంటనే బండిలోంచి ఉరికి వాడిని అభిమాన పురస్సరంగా ఎత్తుకొని చిట్టెయ్య వంక ఆజ్ఞాపిస్తున్నట్లుగా చూసి చీడీలు ఎక్కి అరుగుమీద రంగణ్ణి దింపాను. వాడు 'అమ్మా, అన్నయ్యో' అంటూ చెంగుచెంగున లేడిపిల్లలా దూసుకుపోయాడు.

'సెలవిప్పించండి బాబూ' అన్నాడు చిట్టి.

నేను జేబులోంచి టూ రూపీస్‌నోటు తీసి యివ్వబోతూంటే వాడు గట్టిగా నవ్వి దండం పెట్టాడు. వాడిహృదయంలోని అభిప్రాయాన్ని అపార్థంచేసుకున్న నేను మరొక అర్ధరూపాయి నాణెం జతచేసి తీసుకో అన్నాను.

'అది కాదండి! నాన్నగారిస్తారులెండి' అని ఒక నిముషమైనా నిలబడక వేగంగా చీడీలు దిగిపోయాడు.

'ఇవేనేవిఁటి కాశీరావడం?' ఈ కంఠస్వర వెంకట్రావు తాతయ్యది.

'అవును తాతయ్యా' అంటూ అక్కడే కూలబడ్డాను.

'పరీక్ష లెలా రాశావోయ్?' అని అడిగాడు నాఓల్డుఫ్రెండు రాఘవరావు.

'ఏదో రాశానులే' యిష్టం లేనట్లుగా ప్రత్యుత్తరంచెప్పి ప్రయత్న పూర్వకంగా హసించాను.

నేను ఊహించుకొన్న మధురవిషయాలు గగనకుసుమాలు గాలిమేడలు. ఆప్యాయంగా అమ్మవచ్చి స్వాగతమీయలేదు. నాన్న అనుకంపతో స్వాగతం చెప్పనూలేదు. ఏమిటీ విపర్యాసం ?

ఎందుకీ భయంకర పరీక్ష ? ఎవరిమీద నాకు అపేక్ష? ఎవరికి నామీద కక్ష? ఏ నేరం వలన నాకు లభించిందీ శిక్ష?

అంధకారాక్రాంతమౌతున్న ఆకాశాన్ని తిల కిస్తు నన్ను నేను ప్రశ్నించుకున్నాను కాని ?

*           *           *

సూర్యోదయమైంది. కనురెప్పలు విడివడి నాయి. రాత్రి సంతృప్తికరమైన నిద్ర పొంద లేకపోవడంవలన కళ్ళు కొద్దిగా మండు తున్నాయి. గడిచిన రాత్రిని సమీక్షిస్తుంటే ఒడలు కంపించింది. అరుగుమీద చతికిల బడి నన్ను ఎగాదిగా చూసింది నీళ్లచెంబుతో బయటికివచ్చిన అనూరాధ అక్కయ్య. పెద్ద చప్పుడయ్యేలా చెంబుక్రిందపెట్టింది.

'ఎప్పుడొచ్చావ్ అక్కా' అడిగాను. 'ఇవాళే లే! ముందు కాళ్ళు కడుక్కొని లోపలికిరా' అనేసి తొందరగా అదృశ్యమైంది. నేను నివ్వెఱపోయాను. కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. నామీద నాకే అసహ్యం వేసింది. ఐనా ఈ పరిస్థితికి ఉచితమైన కారణాలు కంచు కాగడాతో వెతికినా కనపడటంలేదు, ఎలాగో నన్ను నేను సంబాళించుకుని పాదప్రక్షాళ ణోన్ముఖుడనైనాను. చెల్లాయి రమణి తువా లుతోవచ్చి నా ప్రక్కన నిల్చుంది. 'ఏమే రమా! బాగా చదువుకుంటున్నావా?' నా ప్రశ్నకు అది సమాధానంగా 'ఊహుఁ' అని అంది. తువాలు భుజంమీద వేసుకుని హాలులో కాలుపెట్టాను. ఈజీచెయిర్‌లో విలా సంగా పడుకుని నాన్నగారు ఇంటివాసాలు లెక్కపెడుతూ నన్ను చూసి ముఖాన్ని అటు వేపు త్రిప్పుకున్నారు. నా గుండెలు గర్భ కుహరంలోకి దిగజారాయి. అయినా చలించ నట్లుగాపాడిదగ్గుదగ్గి అయనను సమీపించాను.

అకాలమేఘగర్జన ఉద్భుద్ధమైంది'ఏంరా?'

ఇది నాన్నగారు నాతో మాట్లాడిన మొట్ట మొదటిమాట.

'ఎగ్జామినేషన్స్ అయ్యాయి నాన్నగారూ' అన్నాను వినయంగా.

"ఓహో!" చుట్టముట్టించా రాయన.

"సమ్మరు హాలిడేస్ జూన్ ఎయిటీన్త్ వరకూ యిచ్చారు...." ఇది నా సంజాయిషి.

"అహా బాహుంది" ఆయన చుట్టకాల్ప టంలో చూపిస్తున్న ఆసక్తిలో శతాంశమైనా నాయందు ప్రదర్శించలేకపోయారు. మా సంభాషణ ఎలా పొడిగించాలో నాకు తోచ లేదు. అయినా సాహసించాను.

"ఏం నాన్నగారూ నా టెలిగ్రామ్ రిసీవ్ చేసుకున్నారా?"

"ఊఁ" ఈ ఊకారం నా మొహంపై పేడ నీళ్లు సన్నసన్నగా చల్లింది.

"అమ్మవంట్లో ఆరోగ్యం—?" ఆతురత స్ఫురింపజేశాను నా వాక్యంలో.

"ఆఁ"అన్నారాయన ఉలికిపడి! ఈమాత్రం ప్రసంగం చాలనుకొని నేను నిష్క్రమిస్తుంటే మళ్లీ గర్జించింది మా ఫాదర్ నీరదం!

"ఏంరా?" తెల్లబోయి ఆగాను.

"పరీక్షలు బాగా తగలేశావా?" ఈ పర్యా యము నాన్నగారు కొత్తపుంత తొక్కారు.

"లేదండి"అన్నాను. పోర్టుకట్ పదప్రయో గాలు పూర్వీకులనుండి ఎరువు తెచ్చుకొన డానికి ప్రయత్నిస్తూ.



"పోయి అన్నంతిని బచ్చో"—నాకు బెడద తగ్గించారు.

ఈ పావనగృహంలో అడుగుపెట్టినపుడే భోజనాశ సగం లోపించింది. ఈ పలుకు బడితో పూర్తిగా నశించింది. నాన్నగారి నాలుగో బాణం! "సన్యాసానికికూడా సిద్ధంగా ఉండు—?"

సరిహద్దుల ప్రసక్తి కిట్టని దుఃఖ పయః పయోధి నన్ను ఆక్రమించింది.

అష్టాదశవర్షాలూ అహోరాత్రులు కష్టించి తమ కనుపాపలకంటె జాగ్రత్తగా పోషించి ఇంకా కొన్ని సంవత్సరాలు నిరభ్యంతరంగా పెంచదలచిన మా నాన్నగారేనా యీ ఘోర బాణప్రయోగంచేసింది.

టౌనులో సంపాదించుకొన్న తామసగుణం నన్నావహించింది. విద్యార్థిజీవితం నేర్పిన ప్రతీకారేచ్ఛ నన్నావేశించింది. ఒక్కసారికళ్లు మూసికొని చర్వితచర్వణంచేసుకున్నాను.

"లోకంలో మానవులకు ప్రత్యక్షదైవాలు తల్లిదండ్రులు. దయామయులైనవారి ఆజ్ఞ జవదాటడం నా మతంకాదు!" ఈ రెండు వాక్యాలు తడుముకోకుండా అనేశాను. వాటి లోని ఏ మాటలు నాన్నగారి కోపాన్ని రెండిం తలుచేశాయో చెప్పటం కష్టసాధ్యం.

"నోర్ముయ్!"

ఆ దారుణకంఠం నన్ను వంటింట్లోకి తరి మేసింది.

*           *           *

మహానసమందిరంలో ఆవిర్భవించిన కోలా హలంహాలాహలంకంటె చేదుగావుంది. రమణి రంగబాబు అన్నంముద్దలతో బంతులాడు కొంటున్నారు. నా కోసం కాబోలు ఒకవైపు వెండికంచం పీట మరచెంబుడు నుంచినీళ్లు

ఉద్ధరిణి చిన్నగ్లాసు పొందికగా అలంకరించ బడినాయి. కొంచెందూరంలో ఒడియాలు అప్పడాలు విచారంగా కూర్చున్నాయి. మా అక్కయ్యా అనూరాధ బాధగా తలవాల్చుకుని భయజలధికి క్రోధవారాశికి సరిహద్దులలో నిరీక్షిస్తుంది. ఆమెను చూస్తున్న నాకు అశోక వృక్షమూలంలో శోకిస్తున్న సీత జ్ఞాపకం వచ్చింది. బండిదిగగానే కడుపు తడిమి కావలించుకొంటుందని ఊహింపబడిన అమ్మ ఆ ప్రదేశంలో గోచరించలేదు. 'ఆశా నిరాశేనా బ్రతుకూ నేలపాలేనా' అన్న విషాద గేయ చరణం చెవులలో గింగురుమంది. ఆ బట్టల తోటే పీటమీద కూర్చుని శక్యమైనంత నెమ్మదిగా 'అక్కా వడ్డించు' అన్నాను.

"పట్టుపంచ కట్టుకునిరా!" అనునయించినట్లుగా ఆజ్ఞాపించింది. ఆశ్చర్యంకినుక నన్ను పైకొని మదోన్మత్తుణ్ణిచేశాయి. 'నే కట్టుకోను అవసరంలేదు'—నా ప్రత్యుత్తరానికి నివ్వెఱపడి తలయెత్తిచూసింది. ఆ చూపులలో తీక్షణత్వంకంటె అభ్యర్థనభావమే ఎక్కువగా ప్రకటితమైంది. ఈ గృహంలో నివసించే జనాభా నాభాలలో పొరలే విషం దృశ్యమానమవడంతో నా ఆకలి చచ్చింది. పిపాస ఆవరించింది. రెండు చేతులతో చెంబు కసిగా పట్టుకొని అందులోని నీళ్ళు పూర్తిగా తాగేశాను. నా యీ అనాలోచితము అనుచితము అయిన ఆచరణకు నిర్ఘాంతపోయిన అక్కయ్యా కింకర్తవ్యతావిమూఢయై విసురుగా వెళ్లిపోబోతూ రెండే రెండు మాటలంది — అవి 'నిర్భాగ్యుడివి' 'ఔను' ఉక్రోషం పట్టలేక గది అంతా ప్రతిధ్వనించేలా ఆక్రోశించాను. నా విపరీత ప్రవర్తనకు తల్లడిల్లుతూన్న రమణి రంగడు ఉలికిపడి తింటూ తింటూన్న అన్నం వదిలి పారిపోయారు. నావలన ఇంత హంగామా జరుగుతూన్నప్పటికీ మా కుటుంబనౌకను నడిపే అమ్మ నాన్న రానేలేదు. ఇంక ఆ ఏకాంతప్రదేశంలో నిర్జీవప్రతిమాసమానంగా కూర్చోవడం యిష్టంలేక తీవ్రంగా నిట్టూర్చి ఇవతలకు వచ్చేశాను. అనుకోకుండా కళ్లమ్మట నీళ్ళు ఉబికి చెక్కిళ్ళు చెమ్మగిల్లాయి. అసమర్థుని కోపతాపాలకు అంతిమ ఫలితం ఇంతేకదా!

హాలులోని నాన్నగారు ధూమపానసేవ పూర్తిచేసి మర చెంబులోని మంచితీర్థం స్వాహాచెయ్యడంలో లీనమయ్యారు. చేరువలోనే మహాలక్ష్మి సమానురాలు మా అమ్మ కూర్చుని ఏ వేవో సంభాషిస్తుంది. నా ఆడుగులచప్పుడు విన్నదేమో! చెప్పటం ఆపి చెంతకు పిలిచింది. దగ్గఱగా వెళ్లి ఆమెనోటి నుండి వెలువడేమాటలు ఆలకించి తరించడానికి సన్నద్ధుడనయ్యాను.

"పెళ్లిచేసికోవాలని కలలుకంటున్నావా?" అమ్మగారి ఫస్టు క్వశ్చన్ నా కర్ణరంధ్రాలలో ప్రవేశించి శారిడాన్‌కి అర్థరిచ్చింది. మాఊళ్లో అది దొరకదు కాబట్టి దానికి ప్రత్యామ్నాయముగా పిల్లతెమ్మెరలనాస్వాదించి తమాయించుకున్నాను. ఈ తతంగం పూర్తయేసరికి రెండు నిముషాలు గడిచాయి.

'కోడలు రావాలని కోరికగా నీకుంటే నా అభ్యంతరం లేదమ్మా! అయినా నాకు పెళ్లి చేసుకుని పిల్లల్ని కనాలన్న ఉత్కంఠ పుట్టనే లేదు" ఎవ్వరూ ఊహించని ఈ సమాధానం విషం కక్కినట్టు కక్కేసి ఆ వృద్ధదంపతుల ఆక్షేపణలకు నిరీక్షించకుండా అదృశ్యమయ్యాను.

"అవునులే వోయ్ — అవసరాలు తీర్చే అందాలసుందరి అక్కడవుంటే పెళ్లెందుకు చేసుకుంటానంటావ్?" ఈవిధంగా నాన్న ఆవేశంతో అరచి కసితీరక పాడివగ్గుతో సతమతమవ్వసాగారు.

"అబ్బ మీరూరుకోండి" మృదువైన గదమాయింపు నాన్న ఉధృతాన్ని నివారించింది.

ఇంక మరేం వినిపించలేదు.

"కోడలులేని అత్త గుణవంతురాలు! అత్త లేనికోడలు ఉత్తమురాలు" అనుకొని తృప్తిగా ఉచ్ఛ్వాసించి వెచ్చగా నిశ్వాసించి ప్రక్కదులుపుకుని మేనువాల్చాను.

* * *

అట్లా ఎంతకాలం నిద్రించానో గుర్తులేదు. చల్లని మెత్తనిచేతులు నా నుదురు స్పృశించగానే పులకించి జాగ్రదవస్థలోనికి వచ్చాను. సుషుప్తి భంగింపబడటంతో నెమ్మదిగా కనురెప్పలు విప్పి వీక్షించాను. ఎదురుగా మా అక్కయ్యా అనూరాధ నిలబడి నా నేత్రాలలోకి ఆత్రంగా చూస్తుంది. ఆమె చూపులలో ఆప్యాయత తొణికిసలాడుతూంది.

నేను చివాలునలేచి బద్ధకంగా అర్థించాను. 'నన్ను మన్నించు అక్కా' అక్కయ్యా నా ప్రక్కన ఆసీనయై రేగిన నా జుత్తు సవరిస్తూ అడిగింది.

"దేనికని?"

"నీ మనసు నొప్పించానుగా!"

"మన్నించానులే! అఁ కాశీ! ఒక్క విషయంలో నిజానిజాలు తెలుసుకోవాలనుంది చెప్తావా?"

ఆ ప్రశ్న ప్రభవింపజేసిన నివ్వెఱపాటు నణచుకొంటూ తల పంకించాను.

"నరే ముందీపాలు త్రాగు" తవ్వగళాను చేతికిచ్చింది. ఆటంకించకుండా కడుపునింపుకొని తువాలుతో పెదిమలు తుడుచుకొని నిర్వికారంగా అక్కవంక తిరిగాను.

"అన్యథా భావించకు! నువ్వు....నువ్వు" మిగిలినది చెప్పలేక కళ్లుమూసుకొంది.

"భయంలేదక్కా! బాధపడను చెప్పవ్?" అభయదృష్టితో లాలించాను.

"నువ్వు శంకరం చెల్లెలిని .... అన్నపూర్ణను....ప్రేమిస్తున్నావా?"

ఎలా జవాబు చెప్పాలో అవగాహనకాక మౌనంవహించాను. అక్కయ్యా తన సూటి ప్రశ్నను వివరించింది. నే నా వాగ్ధోరణికి చెవులను అంకితంచేశాను.

"తమ్ముడూ! యథార్థవాదులు బంధువిరోధులు. అందుకని తటస్థవిధానం అవలంబించడం క్షేమప్రదంకాబోదు—"

ఆమె పలుకులు వింటూన్న నాకు సముద్రఘోష భీకరంగా వినపడింది. అనుపమాన మహోగ్రమూర్తి నయ్యాను. 'నా కింక చెప్పకు–నేనేదీ వినను. ఎవర్నీ ప్రేమించటం లేదు—ప్రేమించనుకూడా. చెప్పద్దంటే చెప్తావేం? నీకు దండం....నాకు గండం...."

ఆ అరుపులలో కొంచెం ఒత్తిగిల్లాను. పెద్ద చప్పుడైంది. భయంతో కళ్ళుతెరిచాను.

గదిలో ట్యూబ్‌లైటు ప్రకాశాన్ని విరజిమ్ముతూంది. రూమ్‌మేటు రఘు గుఱ్ఱు పెద్దగా ప్రసారమౌతూంది. మంచంకోడుతగిలి తల బొప్పికట్టింది. ఎదురుగా ప్లాస్కు తెల్లబోయి చూస్తుంది.

అలారమ్ టైమ్‌పీస్ గణగణమని హెచ్చరించింది. తృళ్లిపాటుతో రఘులేచి నా అవస్థ పరికించాడు. తడబడుతూ 'ఏం జరిగింది బ్రదర్' అంటూ పరామర్శించాడు.

వాడిన నవ్వు నవ్వి అన్నాను. 'కలకరిగిపోయింది!'

"భారం తీరిందిలే!" అంటూ రఘు బ్రష్ పేస్టు అందించాడు. ★